క్లుప్తంగా

అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవు

అద్దంకి: పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో ప్రతి ఆదివారం నిర్వహించే అన్నగారి సంతలో కూరగాయలు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని మార్కెట్ యార్డు చైర్మన్ వి. పద్మావతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్కెట్ ఆధ్వర్యంలో అద్దంకిలో ప్రతి ఆదివారం, జె. పంగులూరులో ప్రతి శుక్రవారం, మేదరమెట్లలో ప్రతి బుధవారం సంత నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆయా సంతల్లో మార్కెట్ వారు నిర్ణయించిన ధరకే కూరగాయాలు విక్రయించాలని అధిక ధరలకు విక్రయించి వినియోగదారులను దోచుకునే విధంగా విక్రయాలు జరపవద్దని తెలిపారు.

విద్యార్థులను తీర్చిదిద్దాలి



రికార్డులను పరిశీలిస్తున్న డైట్ అధ్యాపకుడు

అద్దంకి: ఉపాధ్యాయులు అభ్యసనా సామర్థ్యాల పెంపుతో విద్యార్థులను తీరి దిద్దాలని మైనంపాడు డైట్ అధ్యాపకుడు వి. రామకృష్ణారెడ్డి అన్నారు. ఆయన ఎంఈఓ-2 కేవీ శ్రీనివాసరావుతో కలిసి శుక్రవారం మండలంలోని చక్రాయపాలెం గ్రామంలోని మెడల్ ప్రైమరీ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు, హాజరు, పరిసరాల పరిశుభ్రత తదితరాలను పరిశీలించి సంతృప్తి చెందారు. ఎన్‌రోల్‌మెంట్‌ను పెంచినందుకు ఉపాధ్యాయులను అభినందించారు. ఈ తనిఖీ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

చీరాల టౌన్: ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం సామాజిక బాధ్యతని, వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఈపురుపాలెం పంచాయతీ సెక్రటరీ మురళీ బాపూజీ అన్నారు. శుక్రవారం ఈపురుపాలెం గ్రామంలో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోనిద్య కార్యక్రమాలను నిర్వహించి వార్డుల్లో పేరుకుని ఉన్న చెత్తకుప్పలను, చిల్లచెట్లను తొలగించి బ్లీచింగ్ చల్లించారు. గ్రామంలోని నివాసం ఉంటున్న ప్రతి ఒక్కరు వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. విషజ్వరాలు ప్రబలకుండా మురుగునీటి గుంటలను పూడ్చి వేయించారు. స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటికి పంపిణీ చేసిన డస్ట్‌బిన్లను వినియోగించుకుని తడిచెత్త, పొడిచెత్తను వేర్వేరుగా నిల్వచేసి అందించాలన్నారు. జనావాసాల మధ్య చెత్త కుప్పలను నిల్వ చేయకూడదన్నారు.

యూరియా అక్రమంగా నిల్వ ఉంచితే చర్యలు



ఎరువుల దుకాణంలో రిజిస్టర్‌లను పరిశీలిస్తున్న మండల వ్యవసాయాధికారి భాస్కరరావు

పర్చూరు(చినగంజాం): యూరియా అక్రమంగా నిలువ ఉంచి కృత్రిమ కొరత సృష్టించేందుకు ప్రయత్నిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయాధికారి కె. భాస్కరరావు హెచ్చరించారు. మండలంలోని చెరుకూరులో ఎరువుల దుకాణాలను మండల వ్యవసాయాధికారి కె. భాస్కరరావు శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. ఎరువుల దుకాణాల్లో ఈ పాస్ మిషన్‌లో ఉన్న స్టాకు, షాపులోని ఎరువుల రిజిస్టర్‌లో ఉన్న స్టాకు, షాపులోని ఎరువుల స్టాక్ పరిశీలించారు. ఎరువుల బిల్లుల పుస్తకాలు, ఎరువులు స్టాక్ రిజిస్టర్, స్టాక్ బోర్డును పరిశీలించారు. ఎరువుల దుకాణానికి అనుసంధానంగా ఉన్న గోడౌన్లు తనిఖీ చేశారు. ఎంఆర్‌పీ ధరకంటే ఎరువుకు ఎక్కువ ధరకు అమ్మినట్లయితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అవసరానికి మించి ఎరువులు రైతులు కొనవద్దని తెలియజేశారు. 10 టన్నుల యూరియా రైతు సేవా కేంద్రానికి వస్తుందని మరో మూడు రోజుల్లో 22 టన్నులు యూరియా సొసైటీకి వస్తుందని కనుక రైతులు ఆందోళన చెందవద్దన్నారు. మండలంలో యూరియా అక్రమంగా నిల్వ ఉంచితే తమ దృష్టికి తీసుకు రావాలని అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

ఎటు చూసినా సమస్యలే!

- డ్రైనేజీలు ఏర్పాటు చేయాలని కౌన్సిలర్ల వినతి
- అజెండాలోని 29 అంశాల్లో ఒకటి రద్దు మిగిలినవి ఆమోదం
- వాడీవేడిగా చీరాల కౌన్సిల్ సమావేశం



కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న కౌన్సిలర్లు

చీరాల అర్బన్: వార్డుల్లో నెలకొని ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వార్డుల కౌన్సిలర్లు కౌన్సిల్ సమావేశంలో ఏకరవు పెట్టారు. సమస్యలను పరిష్కరించకుంటే ప్రజలకు ఏమి సమాధానం చెప్పాలంటూ ముక్త కంఠంతో నినదించారు. శుక్రవారం మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం మున్సిపల్ చైర్మన్ మించాల సాంబశివరావు అధ్యక్షత నిర్వహించారు. ముందుగా జీరో అవర్‌లో పలువురు కౌన్సిలర్లు తమ వార్డుల్లోని సమస్యలను చైర్మన్ దృష్టికి తెచ్చారు. ముఖ్యంగా వార్డుల్లో డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో మురుగునీరు నిలిచిపోతుందని, డ్రైనేజీలను ఏర్పాటు చేయాలన్నారు. వార్డుల్లో మురుగుకాలువలు శిథిలావస్థకు చేరడం, నూతనంగా వేసిన రోడ్ల ఎత్తుకు డ్రైనేజీలు కిందకు ఉండటంతో వర్షం కురిసిన సమయంలో నీరు నిలిచిపోతుందన్నారు. మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ బొనిగల జైసన్‌బాబు మాట్లాడుతూ తమ వార్డులో డ్రైనేజీ, రోడ్లు సక్రమంగా లేవని, రోడ్లు, డ్రైనేజీలను ఏర్పాటు చేయాలని కోరారు. కౌన్సిలర్ పాపిశెట్టి సురేష్ మాట్లాడుతూ వార్డుల్లో ఎక్కువగా రోడ్లు, డ్రైనేజీలు లేకపోవడంతో దోమల వ్యాప్తి ఎక్కువగా ఉందన్నారు. శివారు ప్రాంతాల్లో దోమల బెడదను పరిష్కరించేందుకు ఫాగింగ్ చేయించాలన్నారు. డెంగీ వంటి విషజ్వరాలు రాకుండా అర్బన్ హెల్త్ సెంటర్లు ద్వారా మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలన్నారు. 22 నుంచి 33 వార్డు వరకు రైల్వే ట్రాక్ అవతల వైపు ఉన్నాయని, శివారు ప్రాంతాల్లో ప్రజలు ఇబ్బందులు పడకుండా చూడాలన్నారు. అలానే వార్డు సచివాలయాల్లో ప్రింటర్లు సక్రమంగా పనిచేయడం లేదన్నారు. దీంతో సర్టిఫికెట్లు కోసం బయట తీయించుకోవాల్సి వస్తుందన్నారు. కంప్యూటర్లు కూడా రిపేర్లు వచ్చి మొరాయిస్తున్నాయని తెలిపారు. అలానే వైకుంఠపురంలోని శ్మశానవాటిక లోపలికి వెళ్లే మార్గంలో చిల్లచెట్లు ఎక్కువగా ఉన్నాయని, వీధిలైట్లు సక్రమంగా పనిచేయడం లేదన్నారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో డ్రైనేజీల్లో మురుగునీరు పారుదల లేక వర్షం కురిస్తే నీరు నిలిచిపోతుందన్నారు. డీఈ మాట్లాడుతూ కొందరు వ్యాపారులు డ్రైనేజీల్లో కాంక్రీట్ శ్లాబులు వేయడం వలన మురుగు తీసేందుకు వీలు ఉండడం లేదన్నారు. శ్లాబులకు మ్యాన్‌హోల్ ఏర్పాటు చేయించుకుంటే పేరుకుపోయిన మురుగు బయటకు తీసేందుకు వీలుంటుందన్నారు. అలానే వార్డుల్లో కుక్కల బెడద ఎక్కువగా ఉందని కౌన్సిలర్లు తెలపగా మున్సిపల్ కమిషనర్ స్పందిస్తూ వీధుల్లోని కుక్కలను పట్టి వాటికి ఆపరేషన్లు, రేబిస్ వ్యాక్సిన్లు వేయించి తిరిగి అదే వార్డుల్లో వదిలిపెడుతున్నామన్నారు. అలానే గత కౌన్సిల్ సమావేశంలో వార్డు కౌన్సిలర్లు తెలిపిన పలు సమస్యలను పరిష్కరించామని చైర్మన్ మించాల సాంబశివరావు తెలిపారు. అనంతరం అజెండాలోని అంశాలపై చర్చ నిర్వహించారు. ఒకటో అంశంలో వీధి లైట్లు మరమ్మతులు, ఎల్‌ఈడీ బల్బుల ఏర్పాటుకు సంబంధించి కాంట్రాక్టర్ పనితీరు సక్రమంగా లేదని, నాసిరకమైన వస్తువులు అందిస్తున్నారన్నారు. మున్సిపల్ అధికారులపైనే హైకోర్టులో కేసులు వేశారని గుర్తు చేశారు. దీంతో ఈ అంశాన్ని కౌన్సిల్ రద్దు చేసింది. అలానే పలు అభివృద్ధి పనులకు సంబంధించిన మిగిలిన 28 అంశాలను కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదించింది. మున్సిపల్ అధికారులు, కౌన్సిలర్లు, కో-ఆప్షన్ మెంబర్లు పాల్గొన్నారు.

బార్ టెండర్లు తుస్..!

- వెనుకాడుతున్న వ్యాపారులు
- గడువు పెంచినా టెండర్లు వేసేందుకు ముందుకు రాని వైనం
- చీరాల్లో ఏడు బార్లకు గాను ఒక బార్ కోసం నాలుగు దరఖాస్తులు
- మిగిలిన 6 బార్‌లకు నిల్



చీరాల అర్బన్: 'తాంబూలాలు ఇచ్చేశాం.. తన్నుకు చావండి' అన్న చందంగా కూటమి ప్రభుత్వం తీసుకు వచ్చిన నూతన బార్ పాలసీ ఉంది. ఒక వైపు వైన్‌షాపులకు బార్ల తరహాలో అన్ని అనుమతులూ ఇచ్చి.. తిరిగి నూతన బార్లకు టెండర్లు వేయాలని బార్ అండ్ రెస్టారెంట్ల యజమానులకు చెప్పినా ఫలితం లేకుండా పోయింది. ఖజానాను నింపుకునేందుకు ఇదొక ఎత్తుగడగా మలుచుకుందని బార్ యాజమానులు ఆరోపిస్తున్నారు. హైదరాబాద్ వంటి నగరంలో సంవత్సరానికి బార్ లైసెన్స్ రూ.45 లక్షలు ఉండగా కూటమి ప్రభుత్వం మాత్రం ఒక్కో బార్‌కు రూ.75 లక్షలు కడితేనే టెండర్లు వేయాలని హుకుం జారీ చేసింది. దీనికి తోడు అమ్మిన అమ్మకాల్లో 50 శాతం టాక్స్‌లు వసూలు చేస్తోంది. దీంతో నష్టాలకు వ్యాపారాలు చేయలేమని, అవసరమైతే చేసే వ్యాపారాన్ని అయినా వదులుకుంటామని, ప్రభుత్వం బార్ లైసెన్స్‌ల విధానం మార్చాలని డిమాండ్ చేస్తున్నారు. చీరాల ప్రాంతంలో గతంలో ఆరు బార్ షాపులుండగా నష్టాల బారిన పడి రెండు మూసివేశారు. ప్రస్తుతం నాలుగు నడుస్తుండగా కూటమి ప్రభుత్వం జనాభా నిష్పత్తి ప్రకారం మరో బార్‌ను అదనంగా పెంచింది. అంటే చీరాలకు ఏడు నిర్వహించాలని ప్రభుత్వ నిబంధన. టెండర్ల ప్రక్రియకు ఈనెల 26తో ముగియగా ఆశించిన మేర దరఖాస్తులు రాకపోవడంతో మరో రెండు రోజులు పెంచింది. శుక్రవారం సాయంత్రంతో టెండర్లు వేసేందుకు సమయం ముగియడంతో చీరాలలోని ఏడు బార్‌లకు గాను ఒక బార్‌పైనే నాలుగు దరఖాస్తులు వచ్చాయి. మిగిలిన ఆరు బార్‌లకు ఒక్క దరఖాస్తు కూడా రాలేదు. అంటే చీరాల ప్రాంతంలో ఒక బార్ మాత్రమే నడిచేలా ఉంది.

ఎక్సైజ్ అధికారుల మల్లగుల్లాలు...

మద్యం షాపుల కంటే బార్ అండ్ రెస్టారెంట్ల ద్వారా అధిక ఆదాయం వస్తుందనే ఉద్దేశంతో కూటమి ప్రభుత్వం నూతన బార్ పాలసీని తీసుకువచ్చింది. ఇప్పటికే టార్గెట్లతో సతమతమవుతున్న ఎక్సైజ్ అధికారులకు తాజాగా బార్ల టెండర్లు ప్రక్రియ తలనొప్పిగా మారింది. ప్రస్తుత బార్ నిర్వాహకులను ఒప్పించే బాధ్యతలను ఎక్సైజ్ అధికారులకు అప్పగించినట్లు తెలుస్తోంది. దీంతో బార్ నిర్వాహకులతో పాటు గతంలో వైన్ షాపులకు దరఖాస్తు చేసిన వారితో, రియల్ ఎస్టేట్, రిసార్ట్స్ యజమానులు, వ్యాపారులతో నూతనంగా కేటాయించిన బార్లకు టెండర్ల వేయాలని కోరుతూ టెండర్ల ప్రక్రియ ప్రారంభం నాటి నుంచి రోజూ సమావేశాలు ఏర్పాటు చేస్తున్నారు. ఎక్సైజ్ శాఖ ఉన్నతాధికారులు సైతం రంగంలోకి దిగి టెండర్లు వేయించేలా మాట్లాడారు. తమకు తలకు మించి భారమని బార్ యజమానులు చెబుతున్నా టెండర్లు వేయాలంటూ వారిని వేడుకునే పరిస్థితికి వచ్చారు.

క్రీడా నైపుణ్యాల పెంపుదలకు కృషి



క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న ఎంఈఓ కోటేశ్వరరావు



విజేతలకు బహుమతులందిస్తున్న ఎంఈఓ తదితరులు

చినగంజాం: విద్యార్థుల్లో క్రీడా నైపుణ్యాలను పెంపొదించేందుకు కృషి చేయాలని మండల విద్యాశాఖాధికారి- 2 ఎస్. కోటేశ్వరరావు అన్నారు. జాతీయ క్రీడా దినోత్సవం పురస్కరించుకొని మండలంలోని కడవకుదురు జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహించారు. ఇందులో భాగంగా పాఠశాల ఆవరణలో వాలీబాల్, కబడ్డీ పోటీలు నిర్వహించారు. పోటీలను ఎంఈఓ-2 ఎస్. కోటేశ్వరరావు ప్రారంభించారు. వాలీబాల్ పోటీల్లో పల్లెపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రథమ స్థానం, కడవకుదురు జెడ్పీ ఉన్నత పాఠశాల ద్వితీయ స్థానం సాధించగా, కబడ్డీ పోటీల్లో పల్లెపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రథమ, కడవకుదురు జెడ్పీ ఉన్నత పాఠశాల ద్వితీయ స్థానాలు సాధించాయి. దీంతో పాటు తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో కడవకుదురు జెడ్పీ పాఠశాల విద్యార్థిని కె. తుషారా ప్రథమం, ఆడీవీధిపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని డి. గాయత్రి ద్వితీయ స్థానం సాధించారు. వక్తృత్వ పోటీల్లో కడవకుదురు జెడ్పీ పాఠశాల విద్యార్థిని కె. తుషారా ప్రథమం, ఆడీవీధిపాలెం జెడ్పీ పాఠశాల విద్యార్థిని పి. చంద్రిక ద్వితీయ స్థానం సాధించారు. పోటీలు అనంతరం విజేతలకు బహుమతులతో పాటు సర్టిఫికెట్‌లు అందజేశారు. కార్యక్రమంలో కడవకుదురు హెచ్‌ఎం కుర్రా రామారావు, పెదపల్లెపాలెం హెచ్‌ఎం లింగాల వెంకటేశ్వర్లు, ఆర్ పోతురాజు తదితరులు పాల్గొన్నారు.

పాల ఆటో బోల్తా



బోల్తా పడిన పాలక్యాన్ల ఆటో

మేదరమెట్ల: పాల క్యానులతో వెళుతున్న ఆటో బోల్తా పడిన సంఘటన పి.గుడిపాడు జాతీయ రహదారిపై గురువారం రాత్రి చోటు చేసుకుంది. మేదరమెట్ల నుంచి జాగర్లమూడివారిపాలెం పాల క్యానులతో వెళుతున్న ఆటోను వెనుక నుంచి వచ్చిన గుర్తు తెలియని వాహనం ఢీ కొంది. ఈ ప్రమాదంలో ఆటోలోని పాలక్యాన్లు రోడ్డుపై పడిపోగా అందులోని పాలు నేలపాలయ్యాయి. ఈ ప్రమాదంలో ఎవరికీ గాయాలు కాలేదు.

వృద్ధాశ్రమంలో అన్నదానం



అన్నదానం నిర్వహిస్తున్న కాళహస్తి కృష్ణమూర్తి కుటుంబం

మార్టూరు: మండల కేంద్రమైన మార్టూరులో వెంకయ్య వృద్ధాశ్రమంలో వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు కాళహస్తి కృష్ణమూర్తి కుటుంబం శుక్రవారం వృద్ధులకు అన్నదానం నిర్వహించారు. కృష్ణమూర్తి అనసూయ దంపతుల కుమారుడు ప్రబంద్ చౌదరి పుట్టిన రోజు సందర్భంగా ఆశ్రమంలోని వృద్ధుల మధ్య కేక్ కట్ చేసి వృద్ధులు, అనాథలకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రబంద్ చౌదరి భార్య సాయి శిరీష, ఆశ్రమ నిర్వాహకుడు తన్నీరు శివరాజేష్, వైఎస్సార్ సీపీ నాయకుడు గడ్డం మస్తాన్ వలి తదితరులు పాల్గొన్నారు.

చెన్నుబొట్ల అగ్రహారంలో బస్సు నిలపాలి



పర్చూరులో ధర్నా నిర్వహిస్తున్న చెన్నుబొట్ల అగ్రహారం గ్రామ ప్రజలు

పర్చూరు(చినగంజాం): మండలంలోని చెన్నుబొట్ల అగ్రహారంలో జాతీయ రహదారిపై ప్రయాణికుల సౌకర్యార్థం బస్సు ఆపాలంటూ గ్రామస్తులు శుక్రవారం పర్చూరు బొమ్మల సెంటర్‌లో ధర్నా నిర్వహించారు. బొమ్మల సెంటర్‌లో బైఠాయించి నినాదాలు చేశారు. తాము బస్సు ఎక్కేందుకు నిత్యం తిమ్మరాజుపాలెం వెళ్ళి బస్సు ఎక్కడానికి రోడ్డు బాగాలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల జాతీయ రహదారి నిర్మాణం కోసం టిప్పర్‌లు తిరిగి రోడ్డు ధ్వంసమై పోయిందని, కాలినడకన నడిచేందుకు కూడా వీలు లేకుండా పోయిందని వివరించారు. ఈ నేపథ్యంలో చెన్నుబొట్ల అగ్రహారం వద్ద జాతీయ రహదారిపై బస్సు ఆపాలని గ్రామ ప్రజలకు అసౌకర్యం లేకుండా అధికారులు చూడాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ముఖ్యంగా మహిళలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

వంతెనల నిర్మాణానికి ప్రతిపాదనలు

కారంచేడు: మండల కేంద్రమైన కారంచేడు-కుంకలమర్రు రహదారిలో దశాబ్దాల కాలంలో అపరిష్కృతంగా నిలచిపోయిన వంతెనల నిర్మాణాలకు ఎట్టకేలకు మోక్షం కలగనుంది. బ్రిటిష్ కాలం నాటి వంతెనలు శిథిలావస్థకు చేరుకున్నాయి. ఈ విషయంపై సాక్షిలో అనేక కథనాలు వెలువడ్డాయి. గత నెల 25వ తేదీన 'క్షణ క్షణం..భయం..భయ' అని కథనం వెలువడింది. దీంతో ఉన్నత స్థాయి అధికారులు స్పందించారు. శుక్రవారం ఆర్‌అండ్‌బీ ఒంగోలు ఎస్‌ఈ రవినాయక్ కుంకలమర్రు రోడ్డులోని దొంగ తూముల వద్ద ఉన్న మూడు వంతెనలతో పాటు, కుంకలమర్రు గ్రామం సరిహద్దులో ఉన్న ప్రధాన వంతెన నిర్మాణాలకు ప్రతిపాదనలు సిద్ధం చేశామని తెలిపారు. దొంగ తూముల వద్ద ఉన్న రొంపేరు కుడి, ఎడమల కాలువల పైన వంతెనలతో పాటు, కొమ్మమూరు కాలువ పక్కన ఉన్న వంతెనలకు రూ. 18 కోట్లు, కుంకలమర్రు వద్ద వంతెనకు రూ. 5 కోట్లు కలిపి మొత్తం రూ. 23 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేసి ఉన్నతాధికారులకు పంపించామన్నారు. ఆయనతో పాటు చీరాల డీఈ నళిని, కారంచేడు ఏఈ శ్రీకాంత్‌లు పాల్గొన్నారు.



కారంచేడు దొంగతూముల వద్ద వంతెనలు పరిశీలిస్తున్న ఎస్‌ఈ రవినాయక్

తేనెకంటే మధురం తెలుగు



బల్లికురవలో రామ్మూర్తి పంతులు వేషధారణలో విద్యార్థి గురుశ్యామ్



అద్దంకి: మాట్లాడుతున్న సీహెచ్‌వీ శ్రీనివాసమూర్తి



జె.పంగులూరు: ధ్యాన్ చంద్, రామమూర్తి పంతులు చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

–ఘనంగా తెలుగు భాషా దినోత్సవం

అద్దంకి: తెలుగువారి ఆత్మగౌరవం తెలుగు భాషా దినోత్సవం అని ప్రధానోపాధ్యాయుడు సీహెచ్‌వీ శ్రీనివాసమూర్తి అన్నారు. బొమ్మనంపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం తెలుగు భాషా దినోత్సవం, జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు సీహెచ్‌వీ శ్రీనివాసమూర్తి మాట్లాడారు. గ్రాంధిక భాష తమకు అవసరం లేదంటూ వ్యవహారిక భాష కోసం పోరాడి, సాధించిన పిడుగు.. గిడుగు వారన్నారు. తెలుగు భాషోపాధ్యాయులు జ్యోతి శ్రీమన్నారాయణ మూర్తి, వ్యాయామ ఉపాధ్యాయులు కె.సుబ్బారావు, కంచర్ల అనిత పాల్గొన్నారు.

వేటపాలెం: స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో హాకీ మాంత్రికుడు ధ్యాన్ చంద్, గిడుగు రామమూర్తికి శుక్రవారం ఘనంగా నివాళులర్పించారు. హెచ్‌ఎం ఉమ్మిటి వేణుగోపాలరావు, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

మేదరమెట్ల: కొరిశపాడు మండలంలోని మేదరమెట్లలో గల రాధాస్‌గీతమ్ హైస్కూల్‌లో తెలుగుభాష దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. తెలుగు భాష గొప్పతనాన్ని వివరించారు.

కారంచేడు: దేశం కోసం ప్రాణత్యాగాలను చేసిన ఎంతో మహనీయుల ఆశయాలను ప్రతి ఒక్కరూ అనుసరించాల్సి ఉందని ఎంఈఓలు ఎంవీ సత్యన్నారాయణ, మొలబంటి వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం స్థానిక మండల విద్యావనరుల కేంద్రంలో ఏర్పాటు చేసిన తెలుగు భాషా దినోత్సవం, జాతీయ క్రీడా దినోత్సవాలను పురస్కరించుకొని తెలుగు వ్యవహారిక భాషా పితామహుడు గిడుగు వెంకట రాంమూర్తి, హాకీ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్‌ల చిత్రపటానికి నివాళులర్పించారు. కొడవలివారిపాలెంలో హెచ్‌ఎం ఏ ఉమామహేశ్వరరావు నివాళులర్పించారు. కుంకలమర్రు ఉన్నత పాఠశాల, స్వర్ణ ఉన్నత పాఠశాలల్లో నిర్వహించారు.

ఇంకొల్లు (చినగంజాం): ఇడుపులపాడు విద్యాపరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం పిడవర్తి పేరిరెడ్డి.. గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

మార్టూరు: మద్ది సత్యనారాయణ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నివాళులర్పించారు. విద్యార్థులకు పలు రకాల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కోలలపూడి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులను సన్మానించారు. మార్టూరులోని శ్రీనివాస హైస్కూల్, రోటరీ క్లబ్ ఆఫ్ మార్టూరు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.

జె.పంగులూరు: మండల పరిధిలోని కొండమంజులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం జాతీయ క్రీడా దినోత్సవం, తెలుగు భాష దినోత్సవం నిర్వహించారు. హెచ్‌ఎం ఐ. అనిత విద్యార్థులకు బహుమతులు అందించారు.

బల్లికురవ: అమృతం లాంటి తెలుగు భాషను సంరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని బల్లికురవ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె. హనుమంతరావు అన్నారు. తెలుగు ఉపాధ్యాయురాలు, కవయిత్రి, గంగవరపు సునీత, ఉపాధ్యాయులు ప్రసంగించారు.

వేటపాలెం: మహాత్మా జ్యోతిలాల్ పూలే బలహీన వర్గాల సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలో పట్ట భద్రుల సంఘం ఆధ్వర్యంలో తెలుగు భాషా దినోత్సవం, జాతీయ క్రీడా దినోత్సవం వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ నారాయణస్వామి మాట్లాడుతూ తెలుగు భాషలో 56 అక్షరాలు, ఆరు లక్షల పదాలున్నాయన్నారు. శ్రీనివాసరావు, నాగాంజనీయులు, శరత్ బాబు పాల్గొన్నారు.

అద్దంకి రూరల్: సృజన ఆధ్వర్యంలో స్థానిక కమలేశ్వర స్వామి దేవస్థానంలో మాతృ భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గిడుగు రామ్మూర్తి పంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గాడేపల్లి దివాకర దత్తు, కె. అనీల కుమార సూరి, యు. దేవపాలన, జ్యోతి చంద్రమౌళి, మహమ్మద్ రఫీ పాల్గొన్నారు.



మార్టూరు: జెడ్పీ ఉన్నత పాఠశాలలో..



కొడవలివారిపాలెంలో నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు



మేదరమెట్లలో తెలుగు భాష దినోత్సవం



ఇంకొల్లు: గిడుగు రామ్మూర్తికి నివాళులర్పిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు



వేటపాలెం: నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు



వేటపాలెం:మాట్లాడుతున్న సంఘం అధ్యక్షుడు ప్రత్తి వెంకట సుబ్బారావు

బై..బై వినాయకా!

వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా నిమజ్జన ఘట్టం వేడుకగా జరుగుతోంది. వేలాది విగ్రహాలు సముద్ర తీరానికి తరలుతున్నాయి.



చీరాల వాడరేవు తీరంలో సముద్రంలో నిమజ్జనానికి గణనాథుడుని తీసుకువెళ్తున్న భక్తులు



చినగంజాం: నిమజ్జనానికి తరలిస్తున్న కొత్తపాలెం వినాయక విగ్రహం



అద్దంకిలో నిమజ్జనానికి తరలుతున్న గణనాథులు